ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025




అమ్మ, అన్నతో సెల్ఫీ దిగుతున్న డాక్టర్

మానవత్వంతో సేవ చేయండి

కొత్త వైద్యులకు కలెక్టర్ సూచన

పండుగ వాతావరణంలో స్నాతకోత్సవం

7

మాధవా.. ఏమిటిదంతా..!

వాహనాలతో జన సమీకరణ

విజయవాడకు వెళ్లకుండా.. విందు

కాన్వాయ్‌తో నగరంలో హల్‌చల్

విప్లవం తప్పదని మరోమారు బీరాలు


నగరంలో గోరంట్ల మాధవ్ పరుగులు

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నగరంలో హంగామా చేశారు. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసుల ఎదుట బుధవారం హాజరు కావాల్సిన ఆయన.. తన ఇంటి వద్దకు ఉదయం పదుల సంఖ్యలో కార్లను తెప్పించుకున్నారు. అనుచరులతో డీజిల్, పెట్రోల్ పట్టించారు. వాటిని పల్లెలకు పంపి జనాలను రప్పించుకున్నారు. ఇంటి వద్ద షామియానా ఏర్పాటు చేసి.. భోజనం పెట్టారు. మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసీపీ నాయకులు మహానందరెడ్డి, ధనుంజయ యాదవ్ తదితరులు ఆయన ఇంటి వద్దకు వచ్చారు. అనంతరం మాధవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడి, భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. జడ్పీ కార్యాలయం వద్ద వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన తీరుతో ట్రాఫిక్ జామ్ అయింది. అక్కడి నుంచి గుత్తిరోడ్డు మీదుగా వెళ్లి సోములదొడ్డి వరకు వెళ్లారు. పోలీసులు వార్నింగ్ ఇవ్వడంతో అక్కడి నుంచి మూడు, నాలుగు వాహనాలు మినహా అన్నీ వెనుదిరిగాయి.

విప్లవం తప్పదు..

ఇంటి నుంచి బయలుదేరేముందు మాధవ్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పౌరుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రభుత్వం తిరుగుబాటు, విప్లవం తప్పదని అన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తే... న్యాయ వ్యవస్థ ద్వారా ఎదుర్కొంటామని అన్నారు. పోలీసు విచారణకు వెళతానని, చట్టాలను గౌరవిస్తానని అన్నారు. వర్క్‌లోడ్ కారణంగా విజయవాడకు వెళ్లడం ఆలస్యమైందని అన్నారు. ఈ రోజు లేదా రేపు విజయవాడ చేరుకుంటానని అన్నారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ ఎదుట విచారణకు హాజరవుతానని అన్నారు. తొమ్మిది నెలల్లోనే సంక్షేమ పథకాల వైపు చూడకుండా అరెస్టులపై టీడీపీని నడుపుతున్నారని విమర్శించారు. ఎప్పుడో మూడు నాలుగేళ్ల నాటి కేసులో నోటీసిచ్చారని, దీనికి సంజాయిషీ ఇస్తానని అన్నారు. రేపు అనేది ఒకటి ఉంటుందని, అప్పుడు కూడా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. రూల్ ఆఫ్ లా అందరికీ ఒకేలా వర్తింపజేయాలని మాజీ ఎంపీ రంగయ్య అన్నారు. తప్పు ఎవరు చేసినా శిక్షించాలని అన్నారు. అధికారపార్టీలో ఉంటే ఒకలా, ప్రతిపక్షంలో ఉంటే మరోలా చూడకూడదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోక్సో కేసు బాధితుల పేర్లు చెప్పిన అందరికీ నోటీసులివ్వాలని డిమాండ్ చేశారు.

మూమెంట్స్ తగ్గించుకోవ్వా..

బహిరంగంగా తిరగడాన్ని తగ్గించుకోవాలని వైసీపీ నాయకుడు మహానందరెడ్డిని వన్‌టౌన్ పోలీసులు హెచ్చరించారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్... మహానందరెడ్డిని బుధవారం సాయంత్రం స్టేషన్‌కు పిలిపించారు. వర్గాలతో కలిసి బయట తిరగడాన్ని తగ్గించుకోవాలని సూచించారు. గన్‌మెన్ కూడా లేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, అనుచరులు, వర్గాలతో తిరగడం సరికాదని చెప్పినట్లు సమాచారం. ఏదైనా వివాదం తలెత్తితే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. మహానందరెడ్డికి గత ఏడాది డిసెంబరులో గన్‌మెన్‌ను తొలగించారు.

ఐసీడీఎస్ పీడీగా నాగమణి

అనంతపురం విద్య, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఐసీడీఎస్ పీడీగా నాగమణిని నియమిస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. గతంలో పీడీగా పనిచేస్తున్న వనజా అక్కమ్మను మహిళాప్రాంగణం మేనేజర్‌గా డెప్యుటేషన్‌పై పంపారు. అప్పటి నుంచి పీడీ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో కర్నూలు జిల్లా మంత్రాలయం ప్రాజెక్టు సీడీపీఓగా పనిచేస్తున్న నాగమణికి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)గా ఉద్యోగోన్నతి కల్పించి అనంతపురం జిల్లా పీడీగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 23 విడుదల చేసింది.

ఏడు వేల కేసుల రాజీనే లక్ష్యం

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఏడు వేల కేసులను రాజీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ అన్నారు. తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్‌తో కలిసి మాట్లాడారు. చివరి జాతీయ లోక్‌అదాలత్‌లో 6వేలకు పైగా కేసులు పరిష్కారమ య్యాయన్నారు. ఇక్కడ తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. జాతీయ లోక్ అదాలత్‌దే అంతిమ తీర్పు అని, పై కోర్టుకు వెళ్లే అధికారం ఉండదన్నారు. కక్షిదారులు అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టుకోకుండా త్వరగా న్యాయం పొందడానికి ఇదొక మంచి అవకాశమన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టులలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు.

దందాపై దాగుడుమూతలు..!

వైసీపీ నాయకుడి మట్టి రవాణాపై రూ.1.24 కోట్ల జరిమానా


వైసీపీ నాయకుడి మట్టి దందాకు పరాకాష్ట ఈ చిత్రం (ఫైల్)

వసూలు బాధ్యత తీసుకోని శాఖలు

రాబట్టాలంటూ మండల పరిషత్ అధికారులకు ఉత్తర్వులు

తమకు సంబంధం లేదంటున్న ఆ వర్గాలు

యాడికి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ నాయకుడి మట్టి దందాపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖల అధికారులు దాగుడుమూతలు ఆడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.1.24 కోట్ల జరిమానా విధించినా.. వసూలు మాత్రం పట్టించుకోవట్లేదు. రికవరీ తమకు సంబంధం లేదన్నట్లుగా మండల పరిషత్, రెవెన్యూ, గనులు భూగర్భ వనరుల శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా వసూలుపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.1.24 కోట్ల జరిమానా

మండలంలో వైసీపీ నాయకుడి మట్టి దందాపై ఫిర్యాదులు వెళ్లడంతో 2024 నవంబరు 27న రెవెన్యూ, మండల పరిషత్, గనులు, ట్రాన్స్‌కో అధికారులు విచారణ చేపట్టారు. చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యం, యాడికి భైరవకొండ తదితర ప్రాంతాల్లో మట్టి దందా చేసినట్లు నిగ్గుతేల్చారు. మొత్తం 7 సర్వే నంబర్లలో మట్టి తవ్వి, తరలించినట్లు తుర్తించారు. దీనిపై నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపారు. ఆ మేరకు వైసీపీ నాయకుడిపై మొత్తం రూ.1.24 కోట్ల జరిమానా విధించారు. ఆ సొమ్ము వసూలు చేయాలని గనుల శాఖ నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి. అవి వచ్చి రెండునెలలు దాటినా సదరు నాయకుడి నుంచి సొమ్ము వసూలుకు చర్యలు చేపట్టలేదు. ఆ ఉత్తర్వులను సైతం అధికారులు బయటకు వెల్లడించకపోవడంపై మండల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయలోపం

మట్టి దందాపై జరిమానా వసూలులో సంబంధిత శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. దందాపై రెవెన్యూ, మండల పరిషత్, గనుల శాఖల అధికారులు విచారణ చురుగ్గా చేశారు. ప్రభుత్వ భూముల్లో ఏ సర్వే నంబరులో ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టిని వైసీపీ నాయకుడు తవ్వి, తరలించాడనే నివేదికను రెవెన్యూ అధికారులు తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. వాటి ఆధారంగా గనుల శాఖ అధికారులు రూ.1.24 కోట్లు జరిమానా విధించారు. వసూలు చేయాలని ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. దీనిపై మండల పరిషత్ అధికారుల నుంచి భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. జరిమానా వసూలు తమకు సంబంధం లేదని చెబుతున్నారు. మట్టి, ఇసుక తరలింపు తరహా వాటిలో గనులు, రెవెన్యూ అధికారులే రికవరీ చేసుకుంటారని వారు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా ఎలా వసూలు చేయాలో, అందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలోనని మండల పరిషత్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మట్టి దందాపై అధికారుల నివేదిక వివరాలివీ..		
సర్వే నంబరు	తవ్విన మట్టి (క్యూబిక్ మీటర్లలో..)	జరిమానా (రూపాయల్లో..)
753/1	3,250	18,04,725
752	2,946	16,32,582
1	700	3,88,710
546	6,720	37,31,616
343	6,910	38,37,123
1448	1,060	5,88,618
1515	870	48,311
మొత్తం	22,456	1,24,66,485

సర్వత్రా ఉత్కంఠ

గ్రావెల్ దందా వ్యవహారంలో జరిమానా సొమ్ము అధికారులు వసూలు చేస్తారా? లేదా? అని మండలవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. వైసీపీ నాయకుడు చేసిన మట్టి అక్రమ రవాణాపై అధికారులు 10 రెట్లు జరిమానా విధించారు. కోటి రూపాయలకుపైగా రికవరీ అంటే మాటలా అంటూ చర్చించుకుంటున్నారు. ఇంత పెద్ద మొత్తంలో మట్టి దందా జరుగుతున్నపుడు అధికారులు ఏం చేస్తున్నట్లు అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ నాయకుడిని అడ్డుకోలేదా.. మరే కోణం ఏమైనా ఉందా.. అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. జరిమానా వసూలు చేయాలని ఈ ఏడాది జనవరి 2న మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చినా ఎందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారో అర్థం కావట్లేదు. ఇందులో ఏమైనా మతలబు ఉందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఉత్తర్వులు వచ్చిన విషయం వాస్తవమే

మట్టి దందాపై జరిమానా వసూలు చేయాల్సిందిగా గనుల శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చిన మాట వాస్తవమే. ఎలా వసూలు చేయాలనే అంశంపై ఆలోచిస్తున్నాం. ఉన్నతాధికారులతో మాట్లాడి, వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- వీరరాజు, ఎంపీడీఓ

ఇంగ్లిష్ పరీక్షకు 384 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 384 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 20,094 మందికిగాను 19,755 మంది హాజరుకాగా... 339 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1789 మందికిగాను 1744 మంది రాయగా.. 45 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ 4, సభ్యులు 5, కస్టోడియన్లు 13 కేంద్రాలను తనిఖీ చేశారు.

క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం..!

యూనిట్‌ను పరిశీలించిన నిపుణులు

అత్యాధునికంగా.. డిజైన్


క్యాన్సర్ యూనిట్ పరిశీలనకు వచ్చిన రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఢిల్లీ కన్సల్టెంట్ ప్రభంజన్‌సేథ్‌తో ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురంటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని క్యాన్సర్ యూనిట్‌ను అధునాతనంగా నిర్మించి, అత్యాధునికంగా వైద్య సేవలు అందించడానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టరు రమేష్ బాబు, న్యూఢిల్లీకి చెందిన నొక్దావో పొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెంట్ ప్రతినిధి ప్రభంజన్‌సేథ్ జిల్లాకు వచ్చారు. శారదానగర్‌లో ఉన్న క్యాన్సర్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ పక్కనే ఉన్న స్థలంలో అధునాతన క్యాన్సర్ యూనిట్ నిర్మాణానికి సంబంధించి డిజైన్‌ను ఈబృందం రూపొందించింది. అనంతరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణి క్యాలరావుతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడు తూ అత్యాధునిక క్యాన్సర్ యూనిట్ నిర్మాణంతో పాటు చికిత్స పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటు న్నారన్నారు. ప్రధానంగా లీనియర్ యాక్సిలరేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ యూనిట్, సిటీ సిమ్యులేటర్, డోసిమెట్రీ ఎక్విప్‌మెంట్, మోల్డ్‌రూమ్ ఎక్విప్‌మెంట్, సర్జికల్ అంకాలజీ, మెడికల్ విభాగాలకు అవసరమైన పరికరాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, బయోసేఫ్టీ క్యాబినెట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే కమిటీబృందం జిల్లాకు వచ్చిందన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు ఇక్కడ స్థలం లేఅవుట్ ప్లాన్‌ను ఇచ్చారని, దాని ప్రకారం ఆర్కిటెక్చరల్ డిజైన్‌లు ఒకనెలలో సిద్ధం చేసి అనుమతి కోసం పంపుతామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, క్యాన్సర్ విభాగం హెచ్ఓడీ డాక్టరు సతీష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు ప్రశాంతి, ఏపీఎంఎస్‌డీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.



	ఇఫ్తార్	సెహరీ
	6.30	5.16
	గురువారం సాయంత్రం	శుక్రవారం ఉదయం



ఉష్ణోగ్రతలు బుధవారం	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	21.0

మా పనుల వద్ద మీ ఫోజులేమిటి..?

మేయర్‌పై టీడీపీ నాయకుల మండిపాటు

అనంతపురం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో మేము పనులు చేయిస్తుంటే.. మీరు ఫొటోలు తీయించుకుని ఫోజులు కొడతారా..?' అంటూ మేయర్ వశీంపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గుల్జార్‌పేట్, ఇతర ప్రాంతాలలో కార్పొరేషన్ సిబ్బంది పారిశుధ్య కల్పన, ఇతర పనులు చేస్తున్నారని కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్, టీడీపీ నాయకులు ముస్తాక్, ఖలందర్, మోహన్‌కుమార్ అన్నారు. అక్కడికి వెళ్లి మేయర్ ఫొటోలు దిగడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన సొంత డివిజన్‌లో పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తోందని, ముందుగా వాటిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఇప్పటికైనా చేయని పనుల వద్ద ఫొటోలు దిగడం మానుకోవాలని హితవు పలికారు.

సర్.. మేడమ్.. నిధులివ్వండి: దగ్గుపాటి


రాష్ట్ర జలనవరుల శాఖ మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురంలోని నడిమి వంక, మరువ వంకకు ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. అమరావతిలో మంత్రిని బుధవారం ఎమ్మెల్యే కలిశారు. పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో వంకలు పోటెత్తి డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరుతోందని, కాలనీలు మునిగిపోతున్నాయని మంత్రికి వివరించారు. ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం కోసం రూ.88 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ ఆవరణలోని పురాతన భవనాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ ఉన్నాయని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని మంత్రికి వివరించారు. భవనాలకు మరమ్మతులు చేయించాలని, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనపు భవనాలు నిర్మించాలని కోరారు. పెండింగ్‌లోని మెస్, కాస్మొటిక్ చార్జీలు చెల్లించాలని కోరారు. ఉపకార వేతనాలు పోస్ట్ మెట్రిక్ రూ.2.3 కోట్లు, ప్రీ మెట్రిక్ రూ.1.11 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని మంజూరు చేయాలని కోరారు.

ఇంజనీర్ల కక్కుర్తి

జలవనరుల శాఖలో అద్దె వాహనాల గోల్‌మాల్



మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని రాసిన వైట్‌బోర్డు వాహనం

హెచ్చెల్సీ డివిజన్‌లో ఉంచిన అద్దె కార్లు



నిబంధనలకు విరుద్ధంగా వైట్ బోర్డు వాహనాల వినియోగం

బిల్లు మాత్రం ఎల్లోబోర్డు వాహనాల పేరిట డ్రా

ఏటా రూ.కోట్ల నిధులు స్వాహా

బదిలీపై వెళ్లిన ఈఈపై విచారణ



మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో అద్దె వాహనాల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్‌లో ఇదే తంతు సాగుతోంది. ఏకంగా ఓ ఇంజనీరు నాలుగు పోస్టుల్లో పనిచేస్తూ రెండు వాహనాలకు బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. మరో ఇంజనీరు గతంలో హెచ్చెల్సీలో పని చేసి సుమారు రూ.3లక్షలు అద్దె వాహనాల పేరుతో డ్రా చేయడంపై నేటికీ విచారణ సాగుతోంది. తాజాగా ఆ ఇంజనీరు నంద్యాల నుంచి జిల్లాకు వచ్చి జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ వద్ద విచారణకు హాజరైనట్లు సమాచారం. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు ఇదే తరహాలో అద్దె వాహనాల పేరుతో బిల్లులు చేసుకుంటున్నారనే చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది. హెచ్చెల్సీలో ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్న డీఈ ఆ డివిజన్ వైపు నెలకు ఒక్కసారైనా తొంగి చూడకపోవడం అటుంచితే... ప్రతినెలా వెహికల్ అద్దె బిల్లులు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం నిరుద్యోగిగా ఉండే ఒక ఎల్లోబోర్డు వాహనం కలిగిన డ్రైవర్‌కు ఉపాధి కల్పించేలా అద్దె వాహనాలను తీసుకోవాలి. జలవనరుల శాఖలో ఇందుకు విరుద్ధంగా ఇంజనీర్లు సొంత వైట్‌బోర్డు కలిగిన వాహనాల్లో తిరుగుతూ అద్దె కోసం బినామీ ఎల్లో బోర్డు వాహనాలను నమోదు చేస్తున్నారు. ఇక మైనర్ ఇరిగేషన్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జలవనరుల శాఖలో ఏటా అద్దె వాహనాల పేరుతో రూ.కోట్లాది నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

బదిలీపై వెళ్లిన ఇంజనీరుపై విచారణ

హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం డివిజన్ బ్రాంచ్ కెనాల్ ఈఈగా పనిచేసిన అధికారిపై వాహనాల బోగస్ బిల్లులు డ్రా చేసిన ఆరోపణలపై విచారణ సాగుతోంది. 2020, 2021 సంవత్సరాల్లో డీబీసీ డివిజన్‌లో ఈఈగా పనిచేసిన శుభకుమార్ నంద్యాలకు బదిలీలపై వెళ్లారు. ఆయన పనిచేసిన సమయంలో సుమారు రూ.3లక్షలు అద్దె వాహనంలో తప్పుడు బిల్లులతో నిధులు డ్రా చేసుకున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో... అప్పటి నుంచి విచారణ సాగుతోంది. తాజాగా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ వద్దకు వచ్చి శుభకుమార్ విచారణకు హాజరైనట్లు సమాచారం. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈ శుభకుమార్ అనేక ప్రయత్నాలతో పాటు గతంలో ఉన్నత స్థానాల్లో పనిచేసిన అధికారుల నుంచి ఒత్తిడి చేయిస్తున్నట్లు తెలిసింది. ఆ కేసు నుంచి ఈఈ శుభకుమార్‌కు విముక్తి కల్పించేందుకు విచారణ చేస్తున్న అధికారులు ఏమాత్రం అంగీకరించడం లేదనేది ఆ శాఖలో చర్చ సాగుతోంది.

ఆయన రూటే వేరు...

జలవనరుల శాఖలో ఆయన రూటే వేరుగా నడుస్తోంది. ఆరోగ్య సమస్యల పేరుతో ఆఫీస్ నుంచి బయటకు కదలరు...వాహనం తీయరు... బిల్లు మాత్రం ప్రతి నెలా ఎంచక్కా డ్రా చేసుకుంటారు. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా ఐదు పోస్టులలో ఆ ఇంజనీరు పనిచేస్తున్నారు. రెండు పోస్టులకు సంబంధించి వెహికల్ బిల్లు డ్రా చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో డిప్యూటీ సీఈగా, హెచ్చెల్సీ ఐ డివిజన్ ఈఈగా, హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్ఈగా, డీబీసీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్నారు. ఇందులో ఐ డివిజన్, డీబీసీ డివిజన్లకు సంబంధించి ప్రతినెలా అద్దె వాహనాలకు సంబంధించి బిల్లులు చేసుకుంటున్నారు. బిల్లులు పెట్టకపోతే 'మీ కథ చూస్తానంటూ...' కిందిస్థాయి ఉద్యోగులపై చిందులేస్తున్నట్లు సమాచారం. తనకు ఆరోగ్యం సరిగా లేదనే సాకుతో ఉద్యోగులపై పెత్తనం చేస్తూ బిల్లులు స్వాహా చేస్తున్నారు.



20మందికిపైగా వాహన సదుపాయం

జలవనరుల శాఖలో కీలకంగా హెచ్చెల్సీ ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈ, ఈఈలు, డీఈలు, ఏఈలు ఉన్నారు. వీరిలో ఎస్ఈ, ఈఈలు, డీఈలకు వాహన సదుపాయం ఉంది. సొంత వాహనాలు వాడరాదనీ, పైగా బినామీ, కుటుంబ సభ్యుల పేరుతో కూడా ఉండరాదనీ, నిరుద్యోగులైన డ్రైవర్లకు అద్దె వాహనం పెట్టుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా నిబంధన విధించింది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ హెచ్చెల్సీ పరిధిలోని ఓ డీఈ... అదే శాఖలోని ఓ డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండానే వెళ్లినట్లు వాహనాలకు బిల్లులు చేసుకుని స్వాహా చేస్తున్నారు. ఇన్‌చార్జి ఈఈగా ఉన్నా.. డివిజన్‌కు నెలలో ఒక్కసారి కూడా వెళ్లిన పాపాన పోలేదు. బిల్లులు మాత్రం ప్రతినెలా క్షేత్రస్థాయిలోకి వెళ్లినట్లు డ్రా చేసుకుని తన ఖాతాలోకి వేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా ఆ ఇంజనీరు ఏమాత్రం లెక్కచేయకుండా అద్దె వాహనాల పేరుతో బిల్లులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే ఉంటున్న డీఈలు ఏసీ ఆఫీస్‌లో కూర్చుని అద్దె వెహికల్‌కు బిల్లులు చేసుకుంటున్నారు.

హంద్రీనీవాలోనూ అదే తంతు

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం జలవనరుల శాఖలో మరో కీలకమైన విభాగం. ఇందులో కూడా ఐదు డివిజన్లు ఉన్నాయి. వాటికి ఐదుగురు ఈఈలు, ఒక్కో డివిజన్‌లో సుమారు నలుగురు డీఈల చొప్పున 20మందికి పైగా ఉన్నారు. వీరిలో సగానికి పైగా ఇంజనీర్లు సొంత వాహనాల్లో వైట్‌బోర్డుతో తిరుగుతూ అద్దె కోసం ఎల్లో బోర్డు వెహికల్ నంబరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు డివిజన్లలో నాలుగు డివిజన్లకు ఇన్‌చార్జి ఈఈలే ఉన్నారు. హంద్రీనీవాలో ఇన్‌చార్జి ఈఈలుగా ఉన్న డీఈలు రెండేసి వాహనాలకు ఒక వైట్, ఒకటి ఎల్లో బోర్డుతో బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. ఇక్కడ అడిగే నాథుడే కరువయ్యాడు.



జలవనరుల శాఖ కార్యాలయం

మైనర్ ఇరిగేషన్‌లో వైట్‌బోర్డు వెహికల్

మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఈఈలు, 12 మంది డీఈలు ఉన్నారు. ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా డీఈలు పనిచేస్తున్నారు. ధర్మవరం డివిజన్‌లోని ఓ డీఈ ఏకంగా సొంత వాహనం వైట్‌బోర్డుతో గవర్నమెంట్ ఆన్ డ్యూటీ పేరుతో తిరుగుతూ అద్దె కోసం బినామీ పేరుతో బిల్లు డ్రా చేస్తున్నారు. ఇలా మైనర్ ఇరిగేషన్‌లో ఈఈలు, డీఈలు అద్దె వాహనాల పేరుతో సొంత వాహనాలకు నిధులు డ్రా చేసుకుంటూ స్వాహా చేస్తున్నారు.



హెచ్చెల్సీ కార్యాలయం

మా దృష్టికొచ్చింది

కొంతమంది ఇంజనీర్లు అద్దె వాహనాలకు తిరగకనే బిల్లులు చేసుకుంటున్నట్లు సమాచారం ఉంది. అటువంటి బిల్లులను నిలుపుదల చేయాలని అధికారులకు సూచించాం. డీఈ, ఈఈలకు వాహన సదుపాయం ఉంది. కచ్చితంగా ఎల్లో బోర్డు ఉండి అద్దె వాహనాలకు మాత్రమే బిల్లులు చెల్లించాలి. వైట్‌బోర్డుతో తిరిగి బిల్లులు చేసుకుంటే కచ్చితంగా విచారణ చేసి, వెనక్కు కట్టిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు.

- నాగరాజ, జలవనరుల శాఖ జిల్లా ప్రాజెక్టుల సీఈ

---

16 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపు

పునరావాసం కల్పించాలంటున్న గ్రామస్థులు

ఎన్నికల హామీతో సరిపెడుతున్న పార్టీలు

ఇదీ ఉల్లికల్లు గ్రామస్థుల కన్నీటి వ్యథ

ఎన్నాళ్లకు ఇస్తారో..?

చాగల్లు ప్రాజెక్టులో ముంపునకు గురైన ఉల్లికల్లు ముఖచిత్రం



ఆ ఊరు ద్వీపంగా మారటానికి, ఆ గ్రామ దీపం ఆరిపోవటానికి ఎంతో సమయం లేదు. ఇప్పటికే మూడు వైపులా నీరు చేరింది. ఆపన్న హస్తం అందక, ప్రభుత దయలేక ఉబికి వచ్చే కన్నీటిని రెప్పలమాటున దాచుకుంటూ వీధులను ముంచుతున్న నీటిలోనే గ్రామస్థులు జీవనం సాగిస్తున్నారు. పదిమంది బాగుకోసం కన్నతల్లిలాంటి పుట్టి పెరిగిన ఊరిని, జీవనాన్ని త్యాగం చేస్తే ఆర్ద్రతతో అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా పూర్తిస్థాయిలో పరిహారం అందడం లేదు. ఉన్నఊరిని వదలేక, వేరే చోట బతకలేక ముంచుతున్న నీటిలోంచి వచ్చే పురుగు పుట్రలతోనే ఆ గ్రామ ప్రజలు సహజీవనం చేస్తున్నారు. ఇన్ని కష్టాల నడుమ కొట్టుమిట్టాడుతున్న ఆ గ్రామమే శింగనమల మండలంలోని ఉల్లికల్లు.

ఉల్లికల్లు గ్రామంలోకి చేరుతున్న నీరు



శింగనమల మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కోసం పొలాలు, ఇళ్లను త్యాగం చేసిన వారిని ఆదుకునే విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ముంపు ముంగిట ఉన్నవారి కన్నీళ్లు తుడిచేందుకు నింబంధనలు అడ్డు వస్తున్నాయని చెబుతూ 16 ఏళ్లు గడిపేశారు. ప్రతి 5 ఏళ్లకు ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప తమ బతుకుల్లో మార్పు రావడంలేదని చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామం ఉల్లికల్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపప్పూరు మండలం చాగల్లు వద్ద 2009లో ప్రాజెక్టు నిర్మించారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామ ముంపునకు గురి అవుతుందని నివేదికలో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సమీపంలో ఉండటంతో ఉట కారణంగా గ్రామం నివాస యోగ్యం కాదని తేల్చారు. అక్కడి భూములు వ్యవసాయానికి పనికిరావని గుర్తించారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పరిహారం అందించలేదు. పునరావాసం కల్పించలేదు.

నిబంధనల పేరిట జాప్యం

చాగల్లు ప్రాజెక్టును 1.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. పూర్తి నిల్వ సామర్థ్యం (ఎఫ్ఆర్ఎల్) ఉన్న సమయంలో ఉల్లికల్లులో 66 ఇళ్లు ముంపులోకి వెళ్లిపోతాయని నివేదికలు చెబుతున్నాయి. పూర్తి నిల్వ సామర్థ్యంపైన 100 మీటర్లు వరకు 218 నివాసాలను గుర్తించారు. నింబంధనల మేరకు అంతవరకు మాత్రమే పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఎఫ్ఆర్ఎల్ 100 మీటర్ల కంటే పైన ఉన్న 560 ఇళ్లకు సైతం పరిహారం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఊర్లో సగం ఖాళీ అయితే మిగతావారంతా ఎలా ఉండాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు. పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఆగిన ప్రక్రియ

గ్రామంలోని ఇళ్లు, ఇతర నిర్మాణాలు, భూమికి వన్‌టైం సెటిమెంట్ కింద పరిహారం చెల్లించాలని గత ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇళ్లకు రూ.84 కోట్లు, ఇతర నిర్మాణాలకు రూ.66 కోట్లు, భూమికి రూ.70 లక్షలు చెప్పున మెత్తం రూ.151 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిచిపోయింది.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత సెప్టెంబరులో శింగనమల తహసీల్దార్ ఉల్లికల్లు పరిహారంపై జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

ఎన్నికల్లో హామీ

ఏ ఎన్నికలు వచ్చిన ఉల్లికల్లు పరిహారమే ముఖ్య అజెండాగా ఉంటోంది. తమ పార్టీ గెలిస్తే పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యేలుగా గెలిచిన డాక్టర్ సాకే శైలజనాథ్, యామినిబాల, జొన్నలగడ్డ పద్మావతి వరకు ప్రకటించారు. తర్వాత నయాపైస ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిహారం తీసుకుని వస్తారని గ్రామస్థులు నమ్మకంతో ఉన్నారు.

పంటలే పండటం లేదు: సూర్యనారాయణ



ప్రాజెక్టు దగ్గరగా ఉండటంతో ఏ పంట సాగు చేసినా భూమి జౌకులు పారుతుండటంతో దిగుబడులు రాలేదు. అయితే పరిహారం ఈ ఏడాది, వచ్చే ఏడాది వస్తుందని ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నాం. పరిహారం అందక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

ఊట నీటిలోనే నివాసం



చాగల్లు ప్రాజెక్టు నీరు మాగ్రామంలోకి చేరడంతో ఊట పెరిగింది. దీంతో ఇళ్లను మూడు అడుగులుపైగా ఎత్తు చేశాం. 18 ఏళ్ల నుంచి పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. అయిన ఇంత వరకు నయాపైస రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిహారం వచ్చేలా చూడాలి. ప్రస్తుతం ఉట నీటిలోనే ఇబ్బందులు పడుతున్నాం.

-రాజాక్



ప్రభుత్వం స్పందించాలి



భారీ వర్షాలు వస్తే గ్రామంలోకి నీరు వస్తాయి. అధికారులు వచ్చి చూసి వెళ్లున్నారే తప్ప న్యాయం చేయడం లేదు. పొలాలు ముంపునకు గురి అవుతుండటంతో స్థానికంగా ఉపాధి తగిపోతోంది. ఉన్న భూములు ముంపులోకి వెళ్లిపోవడంతో పక్క గ్రామల్లో కూలి పనులకు వెళ్తున్నాం.

-లక్ష్మీనారాయణమ్మ

అభివృద్ధికి దూరం..



ముంపు గ్రామం కింద ఉండడంతో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు రావడంలేదు. గ్రామంలో మౌలిక సదుపాయలకు ఉన్న పంచాయతీ నిధులు వాడుతున్నాం గ్రామానికి రావడానికి కనీసం సరైన రోడ్డు లేదు. ప్రభుత్వం పరిహారం ఇస్తే...మరో చోట నిర్మాణాలు చేపడతాం.

- సర్పంచ్ అనసూయమ్మ



ఉల్లికల్లు గ్రామంలో రోడ్డు దుస్థితి

న్యాయం చేస్తాం

ఉల్లికల్లు గ్రామానికి ఏళ్లగా పరిహారం రాకపోవడం సమస్యగా ఉంది. పరిహారం సమస్యను సీఎం దృష్టికి తీసుకుని వెళ్లి బాధితులకు నాయ్యం చేస్తాం. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులపై శ్రద్ధ చూపుతుండటంతో ఉల్లికల్లు బాధితులకు న్యాయం జరుగుతుందని నాకు నమ్మకం ఉంది.

-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే



అనధికార చిట్టీల నిర్వాహకుల మోసాలు

చీట్టీలు!

చిట్టీల సొమ్ము, భారీగా రుణాలు తీసుకుని ఉడాయిస్తున్న వైనం

లబోదిబోమంటున్న బాధితులు

పోలీసులను ఆశ్రయిస్తున్నా.. జరగని న్యాయం



పోలీసు స్టేషన్ వద్ద బాలకృష్ణ బాధితులు

గుత్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డబ్బు దర్పా చూపుతారు. విలాస జీవితం గడుపుతున్నట్లు నటిస్తారు. తమకేమీ తక్కువ లేదన్నట్లు అందరినీ నమ్మిస్తారు. చిట్టీలు నిర్వహిస్తున్నామంటున్నారు. చిట్టీ వేసుకుంటే డబ్బు పొదుపు అవుతుందని నమ్మ బలుకుతారు. చిట్టీలు కట్టించుకుంటారు. డబ్బు కూడా వెంటనే ఇస్తారు. అలా.. చిట్టీలను పెంచుకుంటూ పోతారు. పూర్తిగా నమ్మిన చిట్టీలు వేసుకున్న వారిని అప్పులు అడుగుతారు. డబ్బు ఇచ్చాక కొన్ని నెలలపాటు వడ్డీలు ఠంచనుగా చెల్లిస్తారు. దీంతో పూర్తిగా నమ్మిపోయిన రుణదాతలు అడిగినపుడల్లా అప్పు ఇచ్చుకుంటూ పోతారు. ఇలా ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రుణాలు తీసుకుంటారు. చిట్టీల వేసిన సొమ్ముతోపాటు పెద్దఎత్తున తీసుకున్న రుణాలతో గుట్టుచప్పుడు కాకుండా నిర్వాహకులు ఉడాయిస్తారు. దీంతో బాధితులు షాక్‌కు లోనవుతున్నారు. చిట్టీలు వేసుకున్న డబ్బు, అప్పు ఇచ్చిన సొమ్ము సర్వం కోల్పోతున్నారు. ఇల్లు కట్టుకునేందుకనో, పిల్లల చదువులకనో, పెళ్లిళ్లకనో దాచుకున్న సొమ్మంతా పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆధారాలు చూపాలని పోలీసులు అడుగుతుండడంతో దిక్కులు చూస్తున్నారు. ఇలా అనధికార చిట్టీల నిర్వాహకుల బారిన పడి చాలామంది సర్వం కోల్పోతున్నారు. గుత్తిలో ఇలాంటి చిట్టీ మోసాలు వరుసగా వెలుగు చూస్తున్నాయి.

చిట్టీలు వేసి మోసపోయా: ఉమాదేవి, సూరసింగనపల్లి



మా వీధిలో ఉండే మహిళ వద్ద రూ.5లక్షల చిట్టీ వేశా. నా భర్త.. స్నేహితుల వద్ద రూ.10లక్షలు ఆమెకు అప్పు ఇప్పించారు. ఆమె ఫేక్ ప్రాంసరీ నోట్లు ఇచ్చి, మోసం చేసింది. దీంతో ఇతరులకు మేము వడ్డీ కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ డబ్బుకు ఆమె ఐపీ నోటీసు పంపారు.

ఆశచూపి మోసం చేశారు: ధనలక్ష్మి, గుత్తి ఆర్ఎస్



చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నా. గుత్తి ఆర్ఎస్‌లో అత్తర్ సాహెబ్ వద్ద రూ.3 లక్షలు చిట్టీ వేసి, మోసపోయా. పోలీసులు న్యాయం చేయాలి.

పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేయలేదు: అరీఫా, గుత్తి



పట్టణంలోని కురుంగేరిలో చిట్టీల నిర్వాహకుడు ఐదు నెలల క్రితం మృతి చెందాడు. ఆయన వద్ద రూ.5లక్షలు చిట్టీలను నాతో పాటు నా కుటుంబ సభ్యులు ముగ్గురు వేశాం. ఆయన మృతితో కుటుంబసభ్యులు డబ్బు చెల్లించేది లేదన్నారు. పోలీసులను ఆశ్రయిస్తే ఆధారాలు కావాలన్నారు. దీంతో రూ.15లక్షలు నష్టపోయాం.

అనధికార చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు: వెంకటేశ్వర్లు, సీఐ

చిట్టీల పేరుతో వ్యాపారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. అనుమతులు లేకుండా చిట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

గుత్తి రైల్వేస్‌లో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి అత్తర్ సాహెబ్ చిట్టీల పేరుతో రూ.కోట్లలో వసూలు చేశాడు. గతేడాది జూలై 10న ఏకంగా రూ.3కోట్లతో కుటుంబ సమేతంగా ఇంటికి తాళాలు వేసి ఉడాయించాడు.

సూరసింగనపల్లికి చెందిన మహిళ చీరల వ్యాపారం చేస్తూ కాలనీలో లక్షల్లో చిట్టీలు నిర్వహించారు. ఒకరికి తెలియకుండా మరొకరితో వడ్డీ ఆశ చూపి లక్షలాది రూపాయలు అప్పుగా తీసుకున్నారు. గతేడాది నవంబరు 23న ఇంటికి తాళాలు వేసి, దేవాలయాలకు వెళ్తున్నామని చెప్పి మాయమైపోయారు. ఆ తరువాత ఐపీ నోటీసు పంపడంతో బాధితులు ఖంగుతిన్నారు. పోలీసులను ఆశ్రయించారు.

గతేడాది అక్టోబరులో పట్టణంలో వంకదారు బాలకృష్ణ వ్యాపారం చేస్తూ అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. మార్కెట్‌లోని వ్యాపారులతో పరిచయాలు పెంచుకున్నాడు. చిట్టీలు వేశాడు. ఒక్కసారిగా కుటుంబసమేతంగా రూ.4కోట్లతో ఉడాయించాడని బాధితులు.. పోలీసులను ఆశ్రయించారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కల్తీలపై కఠిన చర్యలు

ఆహార భద్రతాధికారి తస్లీం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆహార భద్రతాధికారి తస్లీం. ఇందులో ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదంటున్న ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: జిల్లాలో తనిఖీలు ఎలా సాగుతున్నాయి..?

జవాబు: రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతాన్ని ఎంచుకుని, తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని ఆయా రెస్టారెంట్లు, హోటల్ సముదాయాలకు అక్కడికక్కడే నోటీసులు జారీ చేస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉంటే శాంపిళ్లు సేకరించి, ల్యాబ్‌కు పంపుతున్నాం.

ప్రశ్న: హోటళ్ల ఏర్పాటు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారా..?

జవాబు: హోటల్, రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే తప్పనిసరిగా ఫారం-బితో లైసెన్సులు పొందాలి. ఇదే విషయాన్ని ప్రతి తనిఖీలో సూచిస్తున్నాం. చాలావాటికి లైసెన్సులు లేవు. లైసెన్సుతో పాటు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అలాంటి వారు మాత్రమే హోటల్, రెస్టారెంట్ నిర్వహించాల్సి ఉంటుంది.

ప్రశ్న: హోటళ్లు, రెస్టారెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారా..?

జవాబు: నెలరోజుల క్రితం అపరిశుభ్రత, కల్తీలు, నాణ్యత ప్రమాణాలు పాటించని 11 హోటల్ సముదాయాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. అన్నింటికీ హెచ్చరికలు జారీ చేశాం.

ప్రశ్న: సీజింగ్, ఫైన్ అథారిటీపై ఏవైనా ఆదేశాలు అందాయా..?

జవాబు: ఆహార భద్రత శాఖకు కేవలం నోటీసులు, హెచ్చరికలు, శాంపిళ్ల సేకరణకు మాత్రమే అనుమతులున్నాయి. కొంతమంది నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా మార్పు కనిపించడం లేదు. సీజింగ్, ఫైన్ అథారిటీ అప్రూవల్‌పై ఉన్నతాధికారులకు విన్నవించాం. ఆదేశాలు అందితే మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: గుత్తిలోని ఓ ధాబాలో ఘటనపై చర్యలు తీసుకున్నారా..?

జవాబు: గత సంవత్సరంలో ఆ ధాబాలో జరుగుతున్న కల్తీలు, అపరిశుభ్రతపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా... దానిని మాకు బదిలీ చేశారు. అందులో భాగంగా ధాబాలో తనిఖీకి వెళ్లా. లైసెన్సు, రిజిస్ట్రేషన్ లేకపోవడాన్ని గుర్తించా. అపరిశుభ్రత, తినుబండారాల్లో నాణ్యతాలోపం కొట్టిచ్చినట్లు కనిపించడంతో జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపా. అనంతరం సీజ్ చేశారు.

ప్రశ్న: కల్తీరాయుళ్లకు ఏం చెప్పదలచుకున్నారు..?

జవాబు: ప్రజలకందించే ఆహార పదార్థాల్లో కల్తీ చేసినా, అపరిశుభ్రత కనిపించినా, నాణ్యత లోపించినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మార్పు రాకపోతే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నా.

సూక్ష్మపోషకాల లోపాలను నివారించండి

డివిజనల్ ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి

నంబులపూలకుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్బుజా, దోస పంటల్లో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించుకోవాలని కదిరి డివిజనల్ ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి.. రైతులకు సూచించారు. మండలంలోని గౌనపల్లి, మరికొమ్మదిన్నె గ్రామాల పరిధిలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కర్బుజా, దోస పంటలను ఉద్యాన శాకాధికారి ప్రతాప్ రెడ్డి పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. సూక్ష్మపోషకాల లోపాలు నివారించడానికి ఫార్మలా-4 ఐదు గ్రా., బోరాన్ 2 గ్రా., లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంట సాగుకు ముందు పశువుల ఎరువు, జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువులు వేసి భూమిని దున్నితే తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. మామిడి చెట్లను పరిశీలించి, నీటితడులు ఇవ్వాలనీ, పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ఏర్పాటు

ధర్మవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల పదో తేదీ నుంచి ఇంజనీరింగ్ టెక్నికల్ సపోర్టు కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఇంటర్‌పాస్, డిగ్రీ, పీజీ చేసి ఆసక్తి కలిగిన యువతీ యువకులు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌కు లేదా ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

ఆగ్రోస్ మేనేజర్ల నియామకం

అనంతపురం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆగ్రోస్ మేనేజర్లను నియమించారు. అనంతపురం ఆగ్రోస్ మేనేజర్‌గా ఓబుళపతి, శ్రీసత్యసాయి జిల్లాకి శ్రీనివాసులును నియమించారు. ప్రస్తుతం అనంతపురం భూసార సంరక్షణా విభాగ ఏడీఏగా ఓబుళపతి, హిందూపురం భూసార సంరక్షణా విభాగ ఏడీఏగా శ్రీనివాసులు పనిచేస్తున్నారు. ఇదివరకు ఉమ్మడి జిల్లాకు ఒకే ఆగ్రోస్ మేనేజర్ ఉండేవారు. తాజాగా వేర్వేరుగా ఇద్దరిని నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలకు మేనేజర్లను నియమించారు.

క్షేమంగా ఇంటికి..

అదృశ్యమైన ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలను తీసుకొచ్చిన పోలీసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో అదృశ్యమైన ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలను వన్‌టౌన్ పోలీసులు క్షేమంగా తీసుకొచ్చారు. నగరంలోని భవానీనగర్‌కు చెందిన నాగరత్న భర్త ఏడేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి సువర్ణ, అరుణ, నాగేంద్ర సంతానం. సువర్ణ, అరుణకు పెళ్లి చేశారు. సువర్ణ భర్త ప్రకాష్ తాగుడుకు బానిసై భార్యాపిల్లలను పట్టించుకునేవాడు కాదు. వీరికి కొడుకు, పాప సంతానం. అరుణ.. భర్త హరీష్‌ను వదిలి తల్లి వద్ద ఉంటోంది. ఈమెకు ఒక కుమారుడున్నాడు. ఈ క్రమంలో నాగరత్న ఏదైనా పని చేసి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండొచ్చుగా అని సువర్ణ, అరుణను దండించింది. తల్లికి భారమవుతున్నామని భావించి.. ఎక్కడికైనా వెళ్లి బతుకుదామని అక్కాచెల్లెళ్లు భావించి గతనెల 6వతేదీన సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తమ పిల్లలు అభిరామ్, రుషి, పల్లవితో కలిసి ఎక్కడికో వెళ్లిపోయారు. దీనిపై ఫిర్యాదు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కాల్‌డేటా ద్వారా వారి ఆచూకీ కనుగొన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడుపి పట్టణంలోని ఓ గదిలో ఉంటున్న వారిని క్షేమంగా తీసుకొచ్చారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన మాస్టర్ అథ్లెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు దక్కాయి. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో బుధవారం 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 నిర్వహించారు. దేశవ్యాప్తంగా 30 నుంచి 100 ఏళ్లలోపు వయసున్న అథ్లెట్లు పాల్గొన్నారు. వాకింగ్, 300, 400 మీటర్ల పరుగు, 3కే రన్, 5కే వాక్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. ఏపీ తరఫున జిల్లా నుంచి 35 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించారు. మూడు చొప్పున బంగారు, రజత, ఐదు కాంస్య పతకాలు సాధించారు. విజేతలను ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు సుధాకర్ బాబు అభినందించారు.

8న హంద్రీనీవాకు నీటి సరఫరా బంద్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాల సరఫరా ఈనెల 8న బంద్ కానుంది. గతేడాది ఆగస్టు 1న శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద హంద్రీనీవాకు 675క్యూసెక్కులతో వదిలారు. ఇప్పటి వరకు హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు 25టీఎంసీలు చేరాయి. ఉమ్మడి జిల్లాలో 89 చెరువులను కృష్ణా జలాలతో నింపారు. ఇందులో జీడిపల్లి నుంచి పీఏబీఆర్‌కు 2టీఎంసీల నీరు మళ్లించారు. ప్రస్తుతం 383 క్యూసెక్కులు మాత్రమే మల్యాల నుంచి హంద్రీనీవాకు సరఫరా చేస్తున్నారు. శనివారంతో పూర్తిగా నీటి పంపిణీ నిలిపివేయనున్నారు. హంద్రీనీవా కింద జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.616టీఎంసీల నీరు నిల్వఉంది. గొల్లపల్లి 1.913టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.645టీఎంసీలు, మారాల 0.483టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.305టీఎంసీలు, చెర్లోపల్లి 1.608టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.471టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫేజ్-1లో 88కిలోమీటర్ల మేర కాలులవ వెడల్పు పనులు, 214కిలో మీటర్ల నుంచి 400కిలోమీటర్ల వరకు కాలవ సిమెంట్ కాంక్రీట్ పనులు ప్రారంభించనున్నారు. దీంతో మల్యాల నుంచి నీటి సరఫరా నిలిపివేసిన తరువాత పనులు ప్రారంభించాలని హంద్రీనీవా పథకం ఇంజనీర్లు ముమ్మర చర్యలు చేపట్టారు. వచ్చే సీజన్‌నాటికి కాలులవ వెడల్పు, లైనింగ్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

మానవత్వంతో సేవ చేయండి



కొత్త వైద్యులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచన

పండుగ వాతావరణంలో స్నాతకోత్సవం

అనంతపురం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎంతో గౌరవం ఉన్న వైద్య వృత్తిని చేపట్టడం అదృష్టమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. మానవత్వంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని నూతన డాక్టర్లకు ఆయన సూచించారు. అనంత వైద్యకళాశాల 2019 బ్యాచ్ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో బుధవారం రాత్రి స్నాతకోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రసంగించారు. ఏ స్థాయికి వెళ్లినా నిస్వార్థంగా, చిత్త శుద్ధితో సేవ చేయాలని అన్నారు. తానూ మొదట వైద్యుడనే అని, ఇప్పటికీ ఆ వృత్తిని తలచుకుంటే ఎంతో ఆనందం కలుగుతుందని అన్నారు. తొలి పోస్టింగ్ ఓ కుగ్రామంలో ఇచ్చారని, అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించి, ప్రభుత్వ ఆస్పత్రి గౌరవం పెంచానని అన్నారు. గురువులను, కళాశాలను, తల్లిదండ్రులను ఎప్పటికీ మరవకూడదని అన్నారు. వృత్తిని, కుటుంబాన్ని సమానంగా చూడగలిగేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాళ్లు, శంషాద్ బేగం, షారన్ సోనియా, డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ సూపరింటెండెంట్ బెనెడిక్ట్ కోయిలో, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పండుగలా వేడుక

వైద్య కళాశాల స్నాతకోత్సవం పండుగలా సాగింది. సూపర్ స్పెషాలిటీ ఆవేరణలో అందమైన వేదికను ఏర్పాటు చేశారు. కోర్సు పూర్తి చేసిన 150 మందికి కలెక్టర్ పట్టాలను అందజేసి, అభినందించారు. విద్యుద్దీపాల వెలుగుల నడుమ కొత్త డాక్టర్లు సంబరాలు చేసుకున్నారు. పట్టాలను స్వీకరిస్తున్న తమ బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. వేడుకలలో మెడికోల ఆట, పాట అందరినీ అలరించింది. కూచిపూడి, భరతనాట్యంతో సంప్రదాయాన్ని చాటారు.



సెల్ఫీ తీసుకుంటున్న నూతన వైద్యులు



కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న నూతన వైద్యుడు






కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి పట్టాలను స్వీకరిస్తున్న నూతన డాక్టర్లు

ఎన్టీఆర్ కలల ప్రాజెక్టులను పూర్తి చేయాలి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలు, కలల ప్రాజెక్టులైన తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరిలను వేగంగా పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆమె మాట్లాడుతూ రాయలసీమలో వానలు తక్కువ, నీటి ఎక్కువ అన్నారు. గోదావరి నది నుంచి ప్రతి ఏడాది వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి-బనకచర్ల అనుసంధానం ద్వారా సీమకు నీళ్లు ఇవ్వడానికి కొత్త సాగునీటి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. జిల్లాలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు పూర్తయితే రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.804 కోట్ల వ్యయంతో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు తీసుకొచ్చేందుకు గతంలో చంద్రబాబు శిలాఫలకం వేసిన విషయాన్ని గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేసి రాప్తాడు నియోజకవర్గంలోని చెరువులకు నీరు వదలడానికి తూములు ఏర్పాటు చేయడంతో పాటు కాలువపై బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని 94 పంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూ.90 కోట్లతో పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీరు అందించే పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న పరిటాల సునీత

భూసేకరణకు కేటాయింపులు పెంచండి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం/ అనంతపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో హంద్రీనీవా ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో బీటీపీ(భైరవానితిప్ప) భూసేకరణకు నిధులు పెంచాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన హంద్రీనీవాపై మాట్లాడారు. జీడిపల్లి, బీటీపీ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యేలా బడ్జెట్‌లో సవరణలు చేయాలని కోరారు. హంద్రీనీవా పనులకు బడ్జెట్‌లో రూ. 2300 కోట్ల కేటాయించడం ద్వారా ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. ఇందులో భాగంగా జీడీపల్లి, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు భూసేకరణకు రూ. 60కోట్ల కేటాయింపు సరిపోదని అభిప్రాయపడ్డారు. కేటాయింపులు పెంచాలని సంబంధిత మంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు. 2019 ఎన్నికల ముందు హంద్రీనీవా ప్రాజెక్టును మరింత విస్తరిస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజలను నిలువునా వంచించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గంపడు మట్టి కూడా ఎత్తలేదని ధ్వజమెత్తారు. సీమ సాగునీటి రంగానికి వెన్నెముకగా చెప్పుకునే హంద్రీనీవాను త్వరితగతిన పూర్తి చేసి అన్ని చెరువులు నింపాలని కోరారు.



మాట్లాడుతున్న కాలవ

297 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణాజలాల 297 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 314 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.578 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

తిరిగిరాని కుంభమేళా రైళ్లు

నెలాఖరుదాకా రద్దు చేసిన అధికారులు

గుంతకల్లు, మార్చి5(ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు రైల్వే డివిజన్ నుంచి వెళ్లిన ప్యాసింజరు రైళ్లను మరో నెల రోజులపాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి పలు ప్యాసింజరు రైళ్లను రద్దుపరచిన సంగతి విదితమే. జనవరి, ఫిబ్రవరి నెలల్లో తిరుపతి వెళ్లే ప్యాసింజరు, ఫాస్ట్ ప్యాసింజరు రైళ్లను ఫిబ్రవరి ఆఖరు దాకా రద్దుపరిచారు. గత నెల 26న కుంభమేళా ఉత్సవం పూర్తికావడంతో ప్రకటించినట్లుగానే మార్చి 1 నుంచి రద్దయిన రైళ్లు డివిజన్‌కు వస్తాయని అందరూ భావించారు. కుంభమేళాకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులను స్వస్థలాలకు చేర్చడానికి ప్యాసింజరు రైళ్లను అక్కడకు వినియోగించడం కోసం రద్దును మార్చి ఆఖరు వరకు పొడిగించినట్లు అధికారులు వెల్లడించారు.

రైళ్ల రద్దు పొడిగింపు

ప్రయాగరాజ్ కుంభమేళాకు పంపడం కోసం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రద్దుపరచిన పలు తిరుపతి ప్యాసింజరు రైళ్లను ఈ నెలాఖరుదాకా రద్దును కొనసాగించనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి (57405), గుంతకల్లు-తిరుపతి (57404), తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజరును ఈ నెల 8వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలిపారు. కదిరిదేవరపల్లి-తిరుపతి (57406), తిరుపతి-గుంతకల్లు (57405), హుబ్లీ-తిరుపతి (57402) ప్యాసింజరు రైళ్లను ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలియజేశారు. తిరుపతి-కాట్పాడి (67209) ప్యాసింజరును ఈ నెల 8 నుంచి 15వ వరకూ, కాట్పాడి-తిరుపతి (67206, తిరుపతి-కాట్పాడి (67207), తిరుపతి-కాట్పాడి (67208) ప్యాసింజరు రైళ్లను ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ, తిరుపతి-కాట్పాడి (67205), కాట్పాడి-తిరుపతి (67210) రైళ్లను ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకూ రద్దుపరచినట్లు తెలియజేశారు.

సరిహద్దులో రోడ్డు ప్రమాదం

టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్న వ్యాన్... బాలుడి దుర్మరణం



రేవంత్ (ఫైల్)

హిందూపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సరిహద్దులోని ముద్దేపల్లిగేటు వద్ద బుధవారం టాటా ఏస్ వాహనాన్ని వ్యాన్ ఢీకొట్టడంతో హిందూపురానికి చెందిన బాలుడు రేవంత్(12) దుర్మరణం చెందాడు. హిందూపురం పట్టణం సడ్లపల్లిలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ ఉప్పర సగర పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్ నారాయణ కుమారుడు రేవంత్ బంధువుల ఊరైన కర్ణాటకలోని పెద్దదాళవాటం వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం టాటాఏస్ వాహనంలో రేవంత్ వరుసకు మేనమామ అయిన లక్ష్మీనారాయణతో కలిసి హిందూపురానికి వస్తున్నాడు. ముద్దేపల్లి గేటు వద్దకు రాగానే మధుగిరి వైపు నుంచి హిందూపురం వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మేనమామ లక్ష్మీనారాయణ కూడా గాయపడ్డాడు. మధుగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇది లైఫ్ టైం సీనియారిటీ లిస్టు

టీచర్లు, హెచ్‌ఎంలకు అత్యంత కీలకమైనది

అభ్యంతరాలుంటే... 10లోపు తెలియజేయండి

కడప ఆర్‌జేడీ శామ్యూల్

అనంతపురం విద్య, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ రూపొందిస్తున్న టీచర్లు, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా అత్యంత కీలకమైందని, లైఫ్‌టైం వంటిదని కడప ఆర్‌జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే ఈ నెల పదో తేదీ లోపు తెలియజేయాలని సూచించారు. జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయన డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచర్లు, హెచ్‌ఎంల సీని యారిటీ జాబితా తయారు చేయడంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15059 మంది హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, పీఈటీలు ఉన్నారన్నారు. వీళ్లకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితా రెడీ చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచామన్నారు. 1980, 1990 నాటి డీఎస్సీ అపాయింట్‌మెంట్స్ నుంచి కూడా డేటా సేకరించారన్నారు. ఉమ్మడి జిల్లాలోని 15059 మంది టీచర్ల వివరాలు సేకరించి సీనియారిటీ లిస్టు సిద్ధం చేసి క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీచర్లు నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల మధ్యలో సైన్స్ సెంటర్‌కు వచ్చి అక్కడ ఏర్పాటుచేసిన కౌంటర్లలో అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. వచ్చిన ప్రతి అప్పీల్‌ను వెరిఫై చేసి, సవరిస్తామని స్పష్టంచేశారు. నిర్ణీత గడువు వరకూ సెలవు దినాల్లో కూడా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ వచ్చిన వాటిని పరిశీలించి, సవరించి తుది జాబితాను సిద్ధం చేస్తామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఫైనల్ సీనియారిటీ లిస్టును ప్రకటిస్తామన్నారు.

నిక్కచ్చిగా రిపోర్టు ఇవ్వాలి

ఇటీవలి కాలంలో విద్యాశాఖలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు ఇచ్చే విచారణ రిపోర్టులపై అనేక విమర్శలు వస్తున్నాయంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆర్‌జేడీ శామ్యూల్ స్పందించారు. విచారణ చేసిన తర్వాత సూటిగా, నిక్కచ్చిగా రిపోర్టు ఇవ్వాలని, సలహాలిచ్చేట్టుగా నివేదికలు ఉండకూడదన్నారు. ఎంక్వైరీ రిపోర్టులు పారదర్శకంగా రావాలంటే..విచారణాధికారులను మార్చాలని డీఈఓను ఆదేశించారు. ఈ జిల్లాలోనే సీనియర్లు చాలా మంది ఉన్నారని, వాళ్లను విచారణాధికారులుగా నియమించాలన్నారు. కొందరు ఎంఈఓలు చాలా నిక్కచ్చిగా ఉంటారని, వాళ్లను తీసుకోవాలని డీఈఓకు సూచించారు. అవసరం అనుకుంటే తన దృష్టికి తీసుకొస్తే ఇతర జిల్లాల నుంచైనా విచారణాధికారులను నియమిస్తామన్నారు.

న్యూస్ బాక్స్

రేపు జాబ్‌మేళా

నార్పల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డెవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. బీగెసీ మొబైల్ షోరూం, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదవిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9010039901 సంప్రదించాలని తెలిపారు.

నియామకం

అనంతపురం విద్య, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల సంఘం విద్యావిభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్‌ను నియమించినట్లు ఆ సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ తెలిపారు. స్థానిక జడ్పీలోని గెస్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో విద్యావిభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్‌కు నియామక పత్రం అందించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఓబుళపతి, కేశవ్, హరీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

యువ పార్లమెంట్‌లో భాగస్వాములవ్వాలి : వీసీ

అనంతపురం సెంట్రల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా జాతీయ యువజన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2025 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ దేవన్న, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శారదతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రైపర్ ప్రిన్సిపాల్ పద్మనాభరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ నాగశుభ, ఎన్ఐకే ఇన్‌చార్జ్ శ్రీనివాస్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పెండ్యాల రామ్మోహన్‌రావుకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) వ్యవస్థాపకుడు పెండ్యాల రామ్మోహన్‌రావు ఆశయాలను కొనసాగిద్దామని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. పెండ్యాల రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం అనంతపురం డిపో గేట్ ఎదుట ఆయన చిత్రపటానికి ఎన్ఎంయూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎంయూ అనంతపురం జిల్లా చైర్మన్ సూరిబాబు, డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 5(ఆం ధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కె ట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపా రు. మార్కెట్‌కు బుధవారం 270 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 6, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.25 వేలు

స్థానిక వ్యవసాయ మార్కె ట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25వేలు పలికినట్లు మా ర్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పో యిన ట్లు తెలిపారు. మార్కెట్‌కు మొ త్తం 401 టన్నుల చీనీకాయలు వచ్చా యన్నారు.

అమ్మ సంస్థ చేయూత


చిన్నారులకు ఇయర్ మిషన్లు ఇస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతోనే వినికిడిలోపంతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు వినికిడి యంత్రాలు అందజేసి అమ్మ సంస్థ చేయూతనిచ్చింది. అశోక్‌నగర్ 5వ క్రాస్‌లో ని వాసముండే తిప్పయ్యస్వామి, రమాదేవి దంపతులు నిరుపేదలు . వారి ఇద్దరు కుమారులకు పుట్టుకతోనే వినికిడిలోపం ఉండటంతో తండ్రి అమ్మ సంస్థను ఆశ్రయించాడు. దీంతో ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బుధవారం రూ. 80వేల విలువైన రీచార్జిబుల్ ఇయర్ మిషన్లను చిన్నారులకు అందజేశారు.

పీఆర్ పీఐయూ ఈఈగా బాలసుబ్బారావు

అనంతపురం న్యూటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పీఆర్ పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) అనంతపురం డివిజన్ ఈఈగా బాలసుబ్బారావును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తున్న ఆయనను నియమించారు. ఇప్పటి వరకు ఆ స్థానానికి పీఆర్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జ్ ఉండేవారు. ఈనెల పదోతేదీ తరువాత బాలసుబ్బారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి అను మానాస్పద స్థితిలో మృతిచెంది నట్లు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. పోలేపల్లికి చెం దిన తలారి రాజప్ప(40) మంగళ వారం సాయంత్రం తన వ్యవసా య తోట వద్దకు వెళ్లాడు. అక్కడ అదే గ్రామానికి చెందిన పక్క పొలం యజమాని ఉమాపతి, రాజప్ప గట్టుపై ఉన్న చెట్టు కోసం గొడవపడ్డారు. ఉమాపతి రాజప్పపై చేయి చేసుకున్నాడు. దీంతో ఇంటికి వచ్చిన రాజప్ప జరిగిన సంఘటనను తన భార్య శ్యామలకు చెప్పాడు. అలాగే చాతిలో నొప్పిగా ఉందని, ఒళ్లంత నొప్పులుగా ఉన్నాయని చెప్పాడు. కుటుంబసభ్యులు అతడిని ధర్మవరం అస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య శ్యామల తన భర్త మృతి అనుమానాస్ప దంగా ఉందని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుమార్తెలు ప్రశాంతి, ప్రసన్న, కుమారుడు రామ్‌చరణ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో ఉప సర్పంచ్ మృతి

రాప్తాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కుమ్మర నరసింహులు (60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరసింహులు వ్యవసాయం, ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు నరసింహులుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వేరుశనగ కట్టెకు నిప్పు

శింగనమల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వేరుశనగ కట్టెకు నిప్పు పెట్టడంతో రూ.5 లక్షలు నష్టవాటిల్లిందని బాధితుడు బాల గంగిరెడ్డి తెలిపాడు. ఇరువెందల గ్రామానికి చెందిన బాల గంగిరెడ్డి అనే వ్యక్తి తన గొర్రెల మేత కోసం 15 ట్రాక్టర్ల వేరుశనగ కట్టె కోనుగోలు చేశాడు. దానిని తన పొలం వద్ద నిల్వ చేశాడు. అయితే బుధవారం పొలం సమీపంలో ఉన్న వంకకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడడంతో ఆది వేరుశనగ కట్టెకు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ. 5లక్షలు నష్టం వాటిలిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

నాకు ఉద్యోగం ఇవ్వాల్సిందే..!

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన ఓ నిరుద్యోగి



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నాకు అన్ని అర్హతలున్నాయి... అందుకు అనుగుణంగా పోస్టు కేటాయించాల్సిందేనని డిజిటల్ అసిస్టెంట్ అభ్యర్థి వినోద్ కుమార్ నాయక్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఉద్యోగ నియామకాలు పూర్తయి ఐదేళ్లు గడుస్తున్నా.. పట్టువీడని బట్టీ విక్రమార్కుడిలా ఆయన తన హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. కదిరి ప్రాంతానికి చెందిన శ్రీనివాసనాయక్ కుమారుడు వినోద్‌కుమార్ బీకాం(జనరల్) పూర్తి చేసినట్లు అధికారులు చెబుతు న్నారు. అదే అర్హతతో బీకాం కంప్యూటర్స్ అర్హత ఉన్న డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. వినోద్‌కుమార్‌కు బీకాం కంప్యూటర్స్ అర్హత లేకపోవడంతో ఉద్యోగ అవకాశం కల్పించకుండా తిరస్కరించారు. దీంతో అతడు అప్పటి నుంచి ఉద్యోగ అవకాశం కల్పించాలని పోరాటం చేస్తున్నాడు. అధికారుల నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో... వినోద్‌కుమార్‌కు ఎందుకు ఉద్యోగం ఇవ్వలేకపోయారో... అందుకు గల కారణాలతో ఫైల్ సిద్ధం చేసుకుని హాజరు కావాలని అక్కడ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో బుధవారం డీపీఓ నాగరాజ నాయుడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారు. దీనిపై డీపీఓ నాగరాజ నాయుడుని వివరణ కోరగా.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎదుట హాజరైనట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న వివరాలకు సంబంధించి అక్కడ నివేదించామన్నారు. వినోద్‌కుమార్‌కు అర్హత లేకపోవడంతో ఉద్యోగం ఇవ్వలేకపోయామన్నారు.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు ఉన్నాతాధి కారుల ఆదేశాలతో తగిన చర్యలు చేపడుతామని తెలిపారు.

వేగంగా పీఎం సూర్య ఘర్

● 45 రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా

అనంతపురం రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేఎన్టీయూ రోడ్డులోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం పీఎం సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ యోజన, పీఎం కుసుమ్ తదితర వాటిపై విద్యుత్తు అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకానికి 46,782 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 2,752దరఖాస్తులు వెండర్స్‌ను ఎంపిక చేసుకోగా, 54 దరఖాస్తులు పరిశీలన పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే 308మందికి సబ్సిడీ జమ అయినట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని 45రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఏఈ రోజుకో దరఖాస్తును పూర్తి చేయాలన్నారు. మంజూరైన ప్రాజెక్టులు గ్రౌండింగ్ కావాలన్నారు. ఇళ్లపై సోలార్ ప్యానల్ బిగించడం చేయాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అవసరమైన పరికరాలను వెండర్స్ సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తు ఏస్థాయిలో ఉందో ఆన్‌లైన్ పోర్టల్‌లో కనిపించేలా చూడాలన్నారు. ఫీడర్ లెవల్ పోలారైజేషన్ స్కీమ్‌కు సంబంధించి సబ్‌స్టేషన్ పక్కన 50ఎకరాల భూమి చూపించాల్సి ఉందని ఇందుకు భూమిని గుర్తించాలన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ పథకం అమలులో జిల్లాని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఎల్‌డీఎం నర్సింగరావు, ఈఈలు, ప్రసాద్, జేవీ రమేష్, రాజశేఖర్, రవిశంకర్, డీఈఈలు శ్రీనివాసులు, గురురాజు, ప్రభాకర్‌రావు, శ్రీనివాసులు నాయుడు, చంద్రశేఖర్, సాయి శంకర్, వెంకటసుబ్బయ్య, ఏఈలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈకి వెంటనే భూమి కేటాయించాలి

అనంతపురం టౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కులకు అవసరమైన భూమిని వెంటనే కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆయన అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడా పెండింగ్ లేకుండా భూకేటాయింపులు చేయాలని సూచించారు. రెవెన్యూకు సంబంధించిన ఈసేవ, ఆధార్ సీడింగ్, అడంగల్ కరెక్షన్, మ్యుటేషన్, ల్యాండ్ తదితర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. సచివాలయ ఉద్యో గులు విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, రియాజుద్దీన్, సర్వే ఏడీ రూప్లానాయక్, పరిశ్రమల శాఖాధికారి శ్రీధర్, గ్రీవెన్స్ తహసీల్దార్ వాణిశ్రీ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిర్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి పూల నాగరాజుతో పాటు ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్‌చేసి మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడారు. ట్రెజరీ అధికారి రాణి, ఏపీ అమరావతి జేఏసీ మహిళా అధ్యక్షురాలు సురేఖరావు, ఆర్టీసీ ఏఓ లక్ష్మీదేవి, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌వీబీ రెడ్డి, పీఎస్ ఖాన్, కల్లప్ప, రత్నం, గోపాల్, కొండయ్య, అశ్విని, సాయిలీల, కృష్ణవేణి, డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌హెచ్ఆర్ ఖాన్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేని వేగవంతం చేయండి

● పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సర్వేని మరింత వేగవంతం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని సచివాలయ సిబ్బందికి పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం స్థానిక 27వ వార్డు పరిధిలోని సచివాలయంలో ఇప్పటి దాకా ఎంఎస్ఎంఈ సర్వే చేసిన తీరుపై అక్కడి సిబ్బందితో ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 10లోగా వంద శాతం సర్వే పూర్తి చేయాన్నారు.

సీనియారిటీ లిస్టులో తప్పులు సరిచేయండి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, మార్చి 5(ఆంధ్రజ్యోతి): టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు సరిచేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ ఇతర నాయకులు మాట్లాడుతూ.....ఇటీవల విద్యాశాఖ విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో అన్ని కేడర్ల ఉపాధ్యాయులు వివరాల్లో వేలాది తప్పులు ఉన్నాయన్నారు.

ఆహార భద్రత శాఖాధికారుల తనిఖీలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు పుచ్చకాయ వ్యాపార సముదాయాలపై జిల్లా ఆహార భద్రత శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రతాధికారి తస్లీం సిబ్బందితో కలిసి బుధవారం నగరంలోని పలు కూడళ్లల్లో ఉన్న పుచ్చకాయ షాపులు, బండ్ల వద్ద కల్తీ పరీక్షలు నిర్వహించారు.

వలసలు నివారించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి లేక గ్రామీణ ప్రాంతాల్లో పేద కూలీలు పొట్టచేత పట్టుకుని పట్టణాలకు వలసబాట పడుతున్నారని, వెంటనే స్థానికంగా ఉపాధి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికసంఘం నాయకులు బుధవారం డ్వామా అడిషినల్ పీడీ సుధాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎన్‌డీఎఫ్‌డీసీ రుణాలను సక్రమంగా అందించాలి

● దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుల డిమాండ్

అనంతపురం అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ పథకం ఎన్‌డీఎఫ్‌డీసీ ద్వారా గరిష్ఠంగా రూ.5 లక్షల దాకా రుణాలు మంజూరు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌కు పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌డ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజినేయులు, వేదిక నాయకులు వసంత్ కుమార్, రాజేష్, దొనస్వామి, ఉద్దీప్‌సింహ వినతి పత్రం అందజేశారు.

బ్యాంకుల సహకారంతోనే మహిళాభ్యున్నతి

● బ్యాంకర్లు, ఏపీఎంల సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల సహకారంతో మహిళా సాధికారత, మహిళా అభ్యున్నతి సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ- వెలుగు పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. బ్యాంకు రుణాలపై బుధవారం స్థానిక పంగల్‌రోడ్డులో ఉన్న టీటీడీసీలో బ్యాంకర్లు, ఏపీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసి మహిళా సాధికారత, మహిళాభ్యున్నతికి సహకరించాలని కోరారు. ఎల్‌డీఎం నరసింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందజేయడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. డీపీఎంలు రవీంద్రబాబు, గంగాధర్, ఏసీలు సుభద్రమ్మ, శివప్రసాద్, నారాయణస్వామి, ఏపీఎంలు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రైవేట్ వ్యక్తులు

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మళ్లీ ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించారు. రామ్‌నగర్, అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదివరకు దాదాపు 18మంది ప్రైవేట్ సిబ్బంది ఉండేవారు. ఏడాదిన్నర క్రితం ఏసీబీ దాడుల నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు, మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ప్రైవేట్ వ్యక్తులు పనిచేయకూడదని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సైతం ఆదేశాలిచ్చారు. అప్పుడప్పుడు కొందరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసేవారు. తాజాగా ఓ వ్యక్తి అక్కడ వీడియోలు తీశాడనే విషయంలోనూ బయటి వ్యక్తులు వచ్చి గొడవకు దిగారు. బుధవారం కొందరు ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయానికి వచ్చారు. ఆంధ్రజ్యోతి ఫొటోలు తీసేందుకు ప్రయత్నించడంతో బయటకు వెళ్లిపోయారు.

ప్రశాంతంగా శేష జీవితం గడపండి : ఎస్పీ


ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ, అధికారులు

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందాక ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఎస్పీ జగదీష్ సూచించారు. జిల్లాలో పని చేస్తున్న ర్యాంకు ప్రమోటీ ఎస్ఐ రంగస్వామి, ఏఆర్ ఎస్ఐ జాతుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ నార్పలు ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో వారిని ఎస్పీ చేతులమీదుగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, ఆర్ఐలు మధు, రాయుడు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, ఆర్ఎస్ఐ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సనప మాధవ రాజుల స్వామి ఉత్సవాల సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. టీడీపీ మండల ఇన్‌చార్జ్ బాలాజీ పోటీలను ప్రారంభించారు. జనరల్ విభాగానికి నిర్వహించిన పోటీల్లో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వందలాది మంది రైతులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. ఉత్సాహంగా జరిగిన పోటీల్లో మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్ప ఎద్దులు 4,227అడుగులు లాగి మొదటి బహుమతిగా రూ. 50వేలు గెలుచుకున్నాయి. సోములదొడ్డి రామసుబ్బారెడ్డి ఎద్దులు, కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలంలోని హుసేనపురానికి చెందిన ఎద్దులు 3,596 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 40వేలను కంబైన్డ్ అందుకున్నాయి. మండల కేంద్రమైన గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు ఎద్దులు 3,592 అడుగులు లాగి మూడో బహుమతి రూ. 30వేలను, తోపుదుర్తి చెన్నప్ప ఎద్దులు 3,314అడుగులు లాగి నాలుగో బహుమతి రూ. 20వేలు గెలుచుకున్నాయి. గార్లదిన్నెకు రామాంజనేయులు ఎద్దులు 3,045అడుగులు లాగి ఐదో బహుమతి రూ. 10వేల ను అందుకున్నాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు బహుమతులను టీడీపీ మండల నాయకులతో కలిసి మండల ఇన్‌చార్జ్ అందజేశారు. అలాగే ప్రతి జతకు పరిటాల రవీంద్ర, సునీత, శ్రీరామ్ ఫొటో కలిగిన జ్ఞాపికను, ఎద్దులకు దానా గిన్నెలను అందజేశారు. అనంతరం మాధవరాజులు స్వామి ఉత్సవాల సందర్భంగా గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న పౌరాణిక నాటకానికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, ఎస్ఆర్ఐ ప్రభాకర్, పరిటాల సుబ్రహ్మణ్యం, మనోహర నాయుడు, వెంకట నారాయణ, రఘునాథరెడ్డి, నాగన్న, కిష్టప్ప చౌదరి, పోతులయ్య, వెంకట్రామిరెడ్డి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

● జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు

అనంతపురం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దోమలు వ్యాప్తి చెందడం వల్లే సీజినల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు ఆదేశించారు. ఆయన బుధవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీజినల్ వ్యాధులు ప్రబలే సమయంలో సబ్ యూనిట్ అధికారులు ఎంతో బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యశాఖ అనుమతి లేకుండా డెంగీ, మలేరియా కేసులంటూ ప్రకటించకూడదన్నారు.

జగన్ నేరస్థుడికి ఎక్కువ... ప్రతిపక్ష నేతకు తక్కువ

● జనసేన పార్టీ నాయకుడు భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేరస్థుడికి ఎక్కువ, ప్రతిపక్ష నేతకు తక్కువని జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలు హేయమన్నారు. వై నాట్ 175 అంటూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి 11 సీట్లకే పడిపోయిన జగన్మోహన్‌రెడ్డి, 100 శాతం స్ట్రైక్ రేట్‌తో పోటీ చేసిన ప్రతిస్థానంలో విజయం సాధించిన పవన్‌కళ్యాణ్ గురించి వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. వైసీపీ నుంచి ఒక్కొక్కరు వెళ్లిపోతుంటే అభద్రతాబావంతో జగన్మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. పవన్‌కళ్యాణ్‌ను మరోసారి విమర్శిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

● డీఎంహెచ్ఓకు గ్రేడ్-3 ఏఎన్ఎంల వినతి

అనంతపురం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొన్నినెలలుగా ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారు.... ఇతర జిల్లాల్లో ఇచ్చారని, తమకూ వెంటనే ఉద్యోగోన్నతులు కల్పించాలని డీఎంహెచ్ఓకు సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలు విన్నవించారు. వారు బుధవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో ఎన్జీఓ నాయకులతో కలిసి డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. డీఎంహెచ్ఓ స్పందించి ఈనెల 20లోగా ఉద్యోగోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు మాధవ్, చంద్రశేఖరరెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడలోని ఆయన నివాసంలో నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే కలిసి, నియోజకవర్గానికి సంబంధించి పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చెరువులు నింపాలని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి


మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే

శింగనమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువులు నింపితే సాగు, తాగు నీరు సమస్య తలెత్తకుండా ఉంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుధవారం మంత్రి లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసి నియోజకవర్గం సమస్యలపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మిడ్ పెన్నార్ డ్యాం సౌత్ కెనాల్ ఆధునికీకరణలో భాగంగా, బైపాస్ కాలువ పనులు పనులు పూర్తి చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరు చేరుతుందన్నారు. జిల్లాలోనే అతిపెద్దదైన శింగనమల శ్రీరంగరాయ చెరువుకు టీఎంసీ నీరు కేటాయించారని, తూముల మర్మమ్మతులు చేస్తే నీటి నిల్వతో 40 గ్రామాల్లో నీటి సమస్య తీరుతుందన్నారు. ఐదువేల ఎకరాలపైగా సాగు చేయవచని, 350 మంది మత్స్యకారులకు జీవనోపాధి కల్పించ వచ్చన్నారు. అలాగే సుబ్బరాయచెరువు, గడికోట ఎత్తిపోతల పథకం పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

ఐదుగురు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శింగనమల డివిజన్‌లో జరిగిన సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత గ్రామీణ నీటి సరఫర పథకం) అమలు తీరులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేలా ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ బుధవారం జీఓఆర్‌టీ నంబర్ 122ను జారీ చేశారు. పనుల పరిశీలనలో నిర్లక్ష్యం, పథకానికి సంబంధించి ఇవ్వాల్సిన బిల్లుల కంటే అదనంగా ఇచ్చారన్న పిర్యాదులతో పూర్తి స్థాయిలో విచారణ చేయించి క్రమశిక్షణ చర్యలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో అప్పటి ఈఈగా ఉండి, ప్రస్తుతం శ్రీకాకులం జిల్లా ఎస్ఈ గా ఉన్న ఎ. హసన్‌బాషా, అప్పట్లో శింగనమల ఏఈఈగా ఉండి, ప్రస్తుతం కళ్యాణదుర్గం డీఈగా ఉన్న చంద్రశేఖర్, ఏఈఈగా ఉన్న శ్రీలత, అప్పట్లో శింగనమల డివిజన్ డీఈగా ఉండి, ప్రస్తుతం రాప్తాడు డీఈగా ఉన్న శ్రీధర్, అప్పట్లో అనంతపురం డీఈగా ఉండి, ప్రస్తుతం సత్యసాయి నీటి సరఫరా బోర్డు డీఈగా ఉన్న రమారావును బాధ్యులు చేస్తూ క్రమశిక్షణ చర్యలకు ఉత్తర్వులు జారీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన షెక్షావలి(36) ఇంటి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక ఈ నెల 3వతేదీ విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ కూడా..

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ కూలీ మృతి చెందాడు. రాప్తాడు మండల కేంద్రానికి చెందిన ముత్యాలప్ప(45) అనంతపురానికి కూలీ పనికి బైక్‌లో వస్తుండగా కక్కలపల్లి క్రాస్ సమీపంలో కియ బస్సు ఢీకొని గాయపడ్డాడు. అతడిని నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ అంజాద్ అలీ బదిలీ

అనంతపురం క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ అంజాద్‌అలీ నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన బుధవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి ఆయనను సన్మానించారు.

ప్రతి గ్రామానికి రోడ్డు వేయడమే ధ్యేయం

కనగానపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని మారుమాల గ్రామాలకు కూడా రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే ఎమ్మెల్యే పరిటాలసునీత ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్ చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ముకుందనాయుడు పేర్కొన్నారు. రూ.2కోట్ల నిధులతో బాలెపాళం - నెమలివరం తారు రోడ్డు పనులను వారు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, డీఈ నారాయణస్వామి, మాజీ జడ్పీటీసీ నెమలివరం ఈశ్వరయ్య, సర్పంచ్‌లు లెక్కల నారాయణ, పూజారి రాజాక్రిష్ణ, ఈడిగ రామాంజి, పతకమూరి అంజి, బిల్లే దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా మరుగుదొడ్ల నిర్మాణం

● నాణ్యతలేని సిమెంటు ఇటుకల వాడకం ● విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన





మరుగుదొడ్ల నిర్మాణానికి వాడిన నాసిరకం సిమెంటు ఇటుకలు, నిర్మాణానికి ముందే కరిగిపోయిన పెళ్లలు, హాస్టల్ వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్లు

శెట్టూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శెట్టూరు బాలుర వసతి గృహం వద్ద మరుగుదొడ్ల నిర్మాణంలో నాసిరకం ఇటుకలను వాడుతున్నారు. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాసిరకం ఇటుకలు వాడుతున్నాడని తెలుస్తోంది. శెట్టూరులోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేవని సర్పంచ్ ఉరాల కుమార్ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే స్వచ్ఛభారత్ పథకం ద్వారా రూ. 12 లక్షల నిధులను మంజూరు చేయించారు. వీటిని నాలుగు యూనిట్లుగా ఒకొక్క యూనిట్‌కు రూ.3 లక్షలు చొప్పున స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరు చేశారు. ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ నాసిరకమైన సిమెంట్ ఇటుకలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నాడు. అక్కడ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పనులను చూసి.. సర్పంచ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలా నాసిరకంగా చేపట్టే నిర్మాణాలు కూలిపోతే బాధ్యత ఎవరిదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధింత ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ సురేంద్రను వివరణ కోరగా.. హాస్టల్ వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించానని తెలిపారు. నాసిరకంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని వాస్తవమే అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గుంతకల్లులోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈనెల 3న గాజువాకలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్కేపీ కళాశాలకు చెందిన బి.మహేంద్ర, హెచ్.మారుతి అనే విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు 500 మంది పాల్గొన్న ఈ పోటీల్లో మహేంద్ర (66 కిలోల విభాగంలో), మారుతి (59 కిలోల విభాగంలో) తృతీయ స్థానాన్ని సాధించారు. పురస్కారాలతో వచ్చిన ఈ విద్యార్థులకు బుధవారం కళాశాలలో ప్రశంసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటడం సంతోషదాయకమన్నారు. అధ్యాపకులు జనార్ధన శాస్త్రి ఈ ఇద్దరు విద్యార్థులకు రూ. 1000 చొప్పున, రాఘవేంద్ర ప్రసాద్ రూ. 500 చొప్పున ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేశ్, బాలకృష్ణ, గోపీనాయక్, నాగరాజు, నారాయణ, జాకీర్ హుసేన్, శివశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఉరవకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ ద్వారా రూపానాయక్ తండాలో అభివృద్ధి పనులు చేపట్టాలని గిరిజనులు అధికారులను కోరారు. వజ్రకరూరు మండలంలోని రూపానాయక్ తండాను డీటీడబ్ల్యూవో రామాంజనేయులు, టూరిజం శాఖ అధికారి జయకుమార్ బుధవారం సందర్శించారు. ధర్తీ జనజాగృతి గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవ్‌నాయక్, సుబ్రహ్మణ్యం నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎస్‌ఎస్‌కు విద్యార్థి ఎంపిక



ఉరవకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు పట్టణంలోని సెంట్రల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విఘ్నేష్ ఎంపికయ్యాడు. గత ఏడాది డిసెంబర్ 8న నిర్వహించిన పరీక్షలో విఘ్నేష్ ప్రతిభ కనబరిచి అర్హత సాధించాడు. విద్యార్థి కేంద్ర ప్రభుత్వం నుంచి నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం పొందుతాడు. విద్యార్థి ఎంపికపై హెచ్ఎం రాజేశ్వరి హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్ట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుత్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ పోస్టులకు బుధవారం ఆర్డీఓ శ్రీనివాసులు సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పీజీటీ, టీజీటీ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించగా వీటిలో 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్కిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కాలనీలో సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి 17 సంవత్సరాలైన తాగునీటి, వీధిదీపాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. తాగునీటి కోసం కాలనీ ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపినాథ్, రాము, సురేష్, వినోద్, శ్రీనివాసులు, మధు, నూర్‌బాష పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్లు విడుదల

విడపనకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు కల్పించాలని ఈ నెల 7 నుంచి 10 వ తేదీ వరకూ రైతు సంఘం అధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలంటూ బుధవారం మండల కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. మిరప, కంది, వరి, జొన్న పంటలకు గిట్టు బాటు ధరలు కల్పించాల ని కోరుతూ ఈ నెల 7న ఉరవకొండ నుంచి అనంతపురానికి నిర్వహించే పాదయాత్రకు రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఆసుపత్రి డీడీఓగా శ్రావణ్‌కుమార్

బొమ్మనహాళ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి డీడీఓగా శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా వైద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఆసుపత్రిలో వైద్యాధికారి శ్రీలక్ష్మి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. ఆమెను తప్పించి డి.హీరేహాళ్ ప్రాథమికఆరోగ్య కేంద్రం డీడీఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను బాధ్యతలను అప్పగిస్తూ డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

యూరియా ద్రావకం తాగి మూడు ఆవుల మృతి

శెట్టూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐదుకల్లు గ్రామంలో గోవిందు అనే రైతుకు చెందిన మూడు ఆవులు మృతిచెందాయి. మూడు పాడి ఆవులు బుధవారం సమీపంలోని తోటలో యూరియా ద్రావకం తాగినట్లు పాడి రైతు తెలిపాడు. పశు వైద్యాధికారి నాగలింగేశ్వరరెడ్డి వెళ్లి పంచనామా నిర్వహించారు. రైతుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. రూ.2 లక్షలు పెట్టి ఆవులను కొనుగోలు చేశానని రైతు తెలిపాడు.

బంకులను తొలగించడం అన్యాయం

గుంతకల్లుటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వేద ఆసుపత్రి ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాల్లో బంకులను తొలగించడం అన్యాయం అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్, పోలీసుల సిబ్బంది బంకులను తొలగిస్తుండగా సీపీఎం నాయకులు అడ్డుకుని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలో అనేక రిజర్వు స్థలాలు ఆక్రమణకు గురైనా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోలేదన్నారు. చిన్న బంకులు వేసుకుని జీవిస్తున్న వారిపై పడడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీనివాసులు, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతి దూలం లాగుతున్న ఎద్దులు

విడపనకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో బుధవారం రాతి దూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలో సుంకులా పార్వతీదేవీ రథోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. అనంతపురం ఏ నారాయణపురం గ్రామానికి చెందిన ఎ.ఫరీద్ ఎద్దులు 3వేల అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ. 50వేలు గెలుపొందాయి. గార్లదిన్నె మండలానికి చెందిన శ్రీరాములు యాదవ్, రాఘవరెడ్డి ఎద్దులు 2,800 అడుగుల దూరం లాగి రెండో బహుమతిని రూ. 40వేలు గెలు పొందాయి. అనంతపురం మండలం సోములదొడ్డికి చెందిన కె.రామసుబ్బారెడ్డి ఎద్దులు 2700 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని రూ. 30వేలు గెలుపొందాయి.

పాత కక్షలతో కుటుంబంపై దాడి

విడపనకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో పాత కక్షలతో కె.రామాంజనేయులు కుటుంబంపై మంగళవారం అర్ధరాత్రి భాస్కర్, రాజు, హనుమంతు, చంద్ర దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. రామాంజనేయులుకు భాస్కర్ గతంలో గొడవ జరిగింది. దానిని మనసులో ఉంచుకుని పాల్తూరులో రాత్రి బయలు నాటకం నిర్వహించిన సందర్భంగా అక్కడ భాస్కర్, రామాంజనేయులుతో గొడవ దిగాడు. పెద్దమనుషులు సర్దుబాటు చేసి పంపించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దాదాపుగా 15 మందికి పైగా వచ్చి తమ కుటుంబంపై దాడిచేశారని రామాంజనేయులు తెలిపారు. ఈ దాడిలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలు కాగా.. వదిన లక్ష్మి, చెల్లెలు పార్వతి, అన్న కొడుకు పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాల్తూరు ఎస్ఐ మురహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

గుత్తిరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ మల్లికార్జున బొలెరో వాహనంలో గుత్తికి వచ్చాడు. తిరిగి వెళ్లే సమయంలో కొత్తపేట గ్రామ శివారులోకి రాగానే లారీని ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టాడు. దీంతో మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఇద్దరికి..

పెద్దవడుగూరు : మండలంలోని అప్పేచర్ల గ్రామం వద్ద ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాడికి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, చెర్లోపల్లికి చెందిన ఆదిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. యాడికి నుంచి గుత్తి వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా.. అప్పేచర్ల రహదారి పక్కన ఇద్దరూ తీవ్రంగా గాయపడి ఉండడంతో తిమ్మాపురం గ్రామస్థులు గమనించి 108 వాహనంలో అనంతపురం తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు కూలీలకు..

పుట్లూరు: మండలంలోని కడవకల్లు-చింతకుంట గ్రామాల మధ్య ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. కడవకల్లుకు చెందిన 8మంది కూలీలు కరివేపాకు కోసేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. చింతకుంట గ్రామశివారులో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో లక్ష్మీదేవి, రత్నమ్మకు స్వల్పగాయాలు కాగా తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

రీసర్వేపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆరా

కూడేరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయపురం గ్రామంలో జరిగిన రీ సర్వేపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ ఆరా తీశారు. భూములను రీసర్వే చేయడానికి ఉన్నతాధికారులు పైలెట్ గ్రామంగా జయపురం గ్రామాన్ని ఎంపిక చేశారు. దీంతో ఆ గ్రామంలో జరిగిన రీసర్వేపై బుధవారం క్షేత్ర స్థాయిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్యటించి రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు తహసీల్దారు మహబూబ్‌బాషా, రీసర్వే డీటీ దబ్బర ప్రసాద్, మండల సర్వేయర్ అయేషా సిద్దికి తదితరులు ఉన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

గుత్తిరూరల్/గుంతకల్లుటౌన్, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లితండా, జక్కలచెరువు గ్రామాల్లో బుధవారం నాటు సారా నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. నాటు సారా తా గడం వల్ల జరిగే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎక్సైజ్ సీఐ మెహన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా గ్రామంలో బుధవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐ శివసాగర్, వీఆర్వో కృష్ణ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తాడిపత్రి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక చుక్కలూరురోడ్డులోని గంగమ్మ ఆలయ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో శీను (35) అనే వ్యక్తి మృతిచెందగా రాఘవేంద్ర అనే వ్యక్తికి గాయాలయ్యాయని రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని నందలపాడుకు చెందిన శీను, యర్రగుంటపల్లికి చెందిన రాఘవేంద్ర చుక్కలూరు వద్ద ఉన్న గ్రానైట్ పరిశ్రమలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శీను సెల్‌ఫోన్ రిపేరి చేయించుకొనేందుకు ద్విచక్రవాహనంలో రాఘవేంద్రతో కలిసి పట్టణంలోకి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో గంగమ్మ ఆలయ సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ శీను మృతి చెందాడు. మృతుడికి భార్య బుజ్జమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కర్ణాటక ప్రమాదంలో తాడిపత్రి వాసి..

బళ్లారి గాంధీనగర్ : చిత్రదుర్గ తాలూకా పరిధిలోని సీబార వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. రోడ్డు పక్కన నిలబడిన లారీని వెనుక నుంచి రెండు లారీలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుల్లో తాడిపత్రికి చెందిన శేఖర్(55) ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ముంబై నుంచి బెంగళూరు వైపువెళుతున్న సమయంలో రెండు లారీలు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొన్నాయి. చిత్రదుర్గ గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భూసమస్యపై తహసీల్దార్ పరిశీలన



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

బ్రహ్మసముద్రం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో కురుబ శేఖరప్ప ఇచ్చిన భూసమస్య అర్జీపై బుధవారం తహసీల్దార్ సుమతి పరిశీలించారు. అనంతరం పోలేపల్లిలో గల 32వ చౌకదుకాణాన్ని తనిఖీ నిర్వహించి లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు

కణేకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న మండల కేంద్రంలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక చిక్కణ్ణేశ్వర కళ్యాణమండపంలో ఉచితంగా కంటి ఆపరేషన్లను నిర్వహిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యుడు వేలూరు మరియప్ప పేర్కొన్నారు.

ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి

కణేకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై సత్యమార్గంలో నడవాలని శ్రీకేదార్ జగత్ గురువులు భీమశంకరలింగస్వామి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అఖిలభారత వీరశైవ మహాసభ ఉపాధ్యక్షుడు కాళశెట్టి తిప్పేస్వామి ఏర్పాటు చేసిన జనజాగృతి ధర్మసమారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి కలియుగంలో ధర్మాది కార్యక్రమాలు కనిపించకుండా పోతున్నాయన్నారు. ప్రజలు వాటి పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అధర్మం వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. సమాజంలో ఎప్పటికీ ధర్మం, సత్యమే విజయం సాధిస్తాయని పేర్కొన్నారు. వాటి మార్గాన పయనించడం ప్రతి ఒక్కరికీ ఉత్తమమని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ప్రముఖులు ఉమాదేవి, మృత్యుంజయశాస్త్రి, విశ్వనాథ్‌శాస్త్రి, వేలూరు మరియప్ప, శరభనగౌడ్, అశోక్, యువరాజ్ గౌడ్, నాగరాజుతో పాటు పలువురు భక్తాదులు పాల్గొన్నారు.



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

మొన్న ఒకరు.. నేడు ఇద్దరు...

కోరం లేక పంచాయతీ సమావేశం రెండోసారి వాయిదా

యాడికి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సమావేశానికి గైర్హాజరవుతున్న వార్డు మెంబర్ల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ అనురాధ అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఇద్దరు వార్డు మెంబర్లు నరేంద్ర, పరమేశ్వర్‌రెడ్డి మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం నిర్వహణకు కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు తెలిపారు. ఈ నెల 3న గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆరోజు సమావేశానికి వార్డు మెంబర్ నాగభూషణం మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు. 5వ తేది సమావేశం నిర్వహిస్తున్నట్లు మళ్లీ సభ్యులందరికి సమాచారాన్ని అందజేశారు. 20మంది వార్డు సభ్యులున్న పంచాయతీలో ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో వాయిదా వేశారు. మరోసారి వార్డు మెంబర్లకు అందరికి సమాచారం ఇచ్చి గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తామని కార్యదర్శి తెలిపారు. మూడోసారి కూడా సమావేశానికి వార్డు మెంబర్లు హాజరుకాకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.



సమావేశానికి హాజరైన ఇద్దరు వార్డు మెంబర్లు

ప్రజాసమస్యలు పట్టవా?

ప్రజా ప్రతినిధులకు ప్రజా సమస్యలు పట్టవా అంటూ పంచాయతీ సమావేశానికి గైర్హాజరవుతున్న సభ్యుల తీరుపై స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో కాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతుండడం, మోటార్లు మరమ్మతులకు గురవుతుండడం, వీధిలైట్ల నిర్వహణ, డ్రైనేజీ సమస్యలు ఇలా లెక్కలేనన్ని సమస్యలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు సమావేశాల్లో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని గైర్హాజరవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నాగాభరణంపై ఊరేగిన చంద్రమౌళీశ్వరుడు



నాగాభరణంపై దర్శనమిస్తున్న స్వామి

ఉరవకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నాగాభరణోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, సహాయ కమిషనర్ రాణి, సిబ్బంది నారాయణస్వామి, వెంటేశులు, రఘు, గోపి తదితరులు పాల్గొన్నారు. గురువారం నెమలి వాహనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏసీ తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

రాయదుర్గంరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్. వినయ్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి బుధవారం తెలిపారు. కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీ సేలం నందు జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా వినయ్‌ను ప్రిన్సిపాల్,అధ్యాపకులు అభినందించారు.

నెలాఖరులోగా ఫాంపాండ్ల పనులు పూర్తి కావాలి

రాయదుర్గంరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో నిర్వహిస్తున్న ఫాంపాండ్ల నిర్మాణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కొండన్న ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 19 పంచాయతీల్లో 86 ఫాం పాండ్లు పనులను ప్రారంభించి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఈనెల 31 నాటికి 100 రోజులకు దగ్గరగా ఉన్న కూలీలను గుర్తించి పనులను కల్పించాలన్నారు. మండలంలోని బీఎన్‌హళ్లి, టీ వీరాపురం, మెచ్చిరి, చదంగొల్లలదొడ్డి గ్రామాలలో వంద రోజులు దగ్గరగా ఉన్న కూలీలకు పనులు కల్పించాలన్నారు. ప్రతిరోజు ఉపాధిహామీ పనులకు 1525 మంది కూలీలు వస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ కార్మిక నేతకు నివాళి

రాయదుర్గంరూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కార్మికుల ఆశాజ్యోతి దివంగత పెండ్యాల రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని యూనియన్ డిపో కార్యదర్శి తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి డిపో అధ్యక్షుడు జిలాన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామ్మోహన్‌రావు 1967లో యూనియన్‌ను స్థాపించి 38 సంవత్సరాల పాటు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. ఉద్యోగులపై విచ్చలవిడి పనిష్మెంట్లను, సస్పెన్షన్లను రద్దు చేసేందుకు కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎండీ షఫీ, సిద్ధేశులు, రవినాయక్, నాగరాజు, తిప్పేస్వామి, సతీష్‌కుమార్, దూద్‌పేరా, నఫీజ్, రమేష్, తిమ్మరాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల కోసం స్థల పరిశీలన

శెట్టూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాకొడికి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామంలోని సర్వే నెంబర్ 184లో 1.70 ఎకరాల విస్తీర్ణాన్ని బుధవారం శెట్టూరు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి పరిశీలించారు. ఆయనతో పాటు సర్వేయర్ ముక్కన్న వీఆర్వో పాల్గొన్నారు. అనంతరం అడవి గొల్లపల్లి చౌకధాన్యపు డిపోని తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగమణి

రాయదుర్గం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఎంఈఓ నాగమణి సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ సీఐ జయనాయక్, ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తించి ఇబ్బందులు పాలు కాకుండా ఉండాలన్నారు. పిల్లలను కొట్టకూడదని, అగౌరవంగా మాట్లాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జయనాయక్, ఎస్ఐ బాలరాజు, ఎంఈఓ 2 వెంకటరమేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీధరఘట్టలో సహకార సొసైటీ వేడుకలు

బొమ్మనహాళ్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీధరఘట్ట గ్రామంలో బుధవారం అంతర్జాతీయ సహకార సొసైటీ వేడుకలను నిర్వహించారు. ప్రాథమిక సహకార సొసైటీ సీఈఓ నాగరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి అఖిల, రెండో బహుమతి రేష్మ, మూడో బహుమతి దీపిక గెలుపొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌బాబు, టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుసిద్ధావదూతల రథోత్సవం

ఉరవకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో బుధవారం గురుసిద్ధావదూతల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి ఊరుబావి వరకూ లాగారు. తిరిగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. భక్తులు రథంపైకి అరటి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అలాగే భగళాముఖి అమ్మవారికి పూజలను చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు